సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
బుధవారం | 14 | ఆగస్టు | 2024



వరి వడిగా..

వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. జోరుగా వరినాట్లు జరుగుతున్నాయి. పొలాల్లో పనులు చేస్తున్న కూలీలతో పల్లెలు కళకళలాడుతున్నాయి.




నేటి నుంచి పవిత్రోత్సవాలు

కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామివారి పవిత్రోత్సవాలు బుధవారం ఉదయం నుంచి ఘనంగా నిర్వహించనున్నారు.

8 లో

మిగులు జలాల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి మంగళవారం 2,99,072 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. బ్యారేజీ వద్ద నీటి మట్టం 6.10 అడుగులకు చేరింది. డెల్టా కాలువలకు 11,350 క్యూసెక్కులు వదిలారు.

న్యూస్‌రీల్

సర్దుబాటు బహిష్కరణ

అమలాపురం టౌన్: విద్యాశాఖ తలపెట్టిన వర్క్ అడ్జస్ట్‌మెంట్ (ఉపాధ్యాయుల పని సర్దుబాటు)పై ఉపాధ్యాయ సంఘాలు ససేమిరా అంటున్నాయి. అసంబద్ధమైన ఈ ప్రక్రియను తాము బహిష్కరిస్తున్నట్లు జిల్లా ఫ్యాప్టో శాఖ స్పష్టం చేసింది. అలాగే పీఆర్‌టీయూ ఉపాధ్యాయ సంఘం కూడా పని సర్దుబాటును బహిష్కరిస్తున్నట్టు ప్రకటించింది. ఈ రెండు జిల్లా స్థాయి సంఘాలకు చెందిన ఉపాధ్యాయులు సర్దుబాటు కార్యక్రమానికి సహాయ నిరాకరణ ఉంటుందని చెబుతున్నారు. జిల్లా ఫ్యాప్టోకు సంబంధించిన ఎస్‌టీయూ, యూటీఎఫ్ జీహెచ్‌ఎం అసోసియేషన్ నాయకులు నాగిరెడ్డి శివప్రసాద్, పోతంశెట్టి దొరబాబు, ఎస్ఎస్ పల్లంరాజు, పెంకే వెంకటేశ్వరరావు, నారాయణ శ్రీనివాసరావు, నిమ్మకాయల గణేశ్వరరావు అమలాపురంలో జరిగిన సమావేశంలో పని సర్దుబాటును వ్యతిరేకించారు. పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు దీపాటి సురేష్‌బాబు, ప్రధాన కార్యదర్శి వాడ్రేవు శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ మొంగం అమృతరావు సైతం ఆ ప్రక్రియను వ్యతిరేకించారు.

అగ్రి కోర్సు దరఖాస్తులకు ఆహ్వానం

రాజమహేంద్రవరం రూరల్: ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో 4 సంవత్సరాల బీఎస్సీ(హానర్స్) కోర్సు ప్రవేశం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు రాజమహేంద్రవరం వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ డి.శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో ఆరు ప్రభుత్వ కళాశాలలు, ఆరు అనుబంధ కళాశాలలు ఉన్నాయన్నారు. 2024–25 విద్యాసంవత్సరం కోర్సు ప్రవేశాలకు ఆసక్తిగల విద్యార్థులు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏఎన్‌జీఆర్‌ఏయూ.ఏసీ.ఐఎన్ యూనివర్శిటీ వెబ్‌సైట్ ద్వారా వివరాలు తెలుసుకోవచ్చన్నారు. ఇందులో కోర్సు వివరాలు, అర్హత, వయోపరిమితి, రైతు వారి కోటా వివరాలు ఇస్తామన్నారు. అపరాధ రుసుంతో ఈనెల 30వతేదీలోగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

'పంపా' రైతుల ఆశలకు లీకేజీ



గడ్డి మోపులను నాలుగో నెంబర్ గేటు అడుగున వేసి లీకేజీ నిలుపుదల చేసేందుకు ప్రయత్నిస్తున్న సిబ్బంది

అన్నవరం: స్థానిక పంపా రిజర్వాయర్ బ్యారేజీ గేట్లుకు ఎన్ని సార్లు మరమ్మతులు చేసినా సమస్య మళ్లీ మొదటికి వస్తోంది. గత జూన్‌లో పంపా బ్యారేజీ గేట్లకు సుమారు రూ.20 లక్షలతో మరమ్మతులు చేపట్టినా నాలుగో నెంబర్ గేటు మాత్రం ఇంకా రిజర్వాయర్ అధికారులకు సమస్యగానే మిగిలింది. పంపా రిజర్వాయర్‌లో వంద అడుగుల నీటిమట్టంతో గణనీయంగా నీరు ఉన్నప్పటికీ నాలుగో నంబర్ గేటు నుంచి ఇంకా నీరు లీకవుతోంది. ఈ గేటు ద్వారా పది క్యూసెక్కుల నీరు వృథాగా పోతుండడంతో అటు అధికారులు, ఇటు రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ నీటి లీకేజీని అరికట్టేందుకు ఎండుగడ్డి మోపులుగా కట్టి గేటు దిగువన ఉంచేందుకు రిజర్వాయర్ సిబ్బంది ప్రయత్నాలు చేస్తున్నారు.

ఖరీఫ్‌పై ఆశ చిగురించిన వేళ... నీటి లీకేజీ..

జూలై రెండో వారం నుంచి ఆగస్టు మొదటి వారం వరకు కురిసిన భారీ వర్షాల కారణంగా పంపా రిజర్వాయర్ నీటిమట్టం పెరగడంతో ఆయకట్టు రైతులకు ఖరీఫ్ పంటపై ఆశలు చిగురించాయి. జూలై 23న పంపా ఆయకట్టుకు నీరు విడుదల చేశారు. మొదట 30 క్యూసెక్కులు చొప్పున విడుదల చేశారు. తరువాత వంద క్యూసెక్కులకు పెంచారు. ప్రస్తుతం రైతాంగం ఖరీఫ్ పనుల్లో బిజీగా ఉండగా రిజర్వాయర్ బ్యారేజీ గేటు నుంచి నీరు వృథాగా పోతుండడం అశనిపాతంలా మారింది.

పుష్కరాలకు కార్యాచరణ

రాజమహేంద్రవరం రూరల్: గోదావరి పుష్కరాలు – 2027 నిర్వహిణకు పటిష్టమైన కార్యాచరణతో ముందుకు వెళదామని కలెక్టర్ పి.ప్రశాంతి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయ సమావేశ మందిరంలో ఆమె వివిధ అంశాలపై చర్చించారు. ఆమె మాట్లాడుతూ గతంలో జరిగిన పుష్కరాలను దృష్టిలో పెట్టుకుని ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు సూచనలను సలహాలను పరిగణనలోకి తీసుకొని చర్యలు తీసుకుంటామన్నారు. శాసన సభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, ఆదిరెడ్డి శ్రీనివాసు మాట్లాడుతూ రహదారుల అభివృద్ధి, డ్రైనేజీ సమస్యల పరిష్కారం దిశగా అడుగులు వేయాలన్నారు. మున్సిపల్ కమిషనర్ కేతన్ గార్గ్ మాట్లాడుతూ నగరంలో డ్రైనేజీ వ్యవస్థ రహదారులపై అవగాహనకు వచ్చామన్నారు. ఎస్పీ డి.నరసింహ కిషోర్ మాట్లాడుతూ ట్రాఫిక్ మళ్లింపు అంశాలపై ప్రత్యామ్నాయ మార్గాలను సూచించారు.

సర్దుపాట్లు

- వర్క్ అడ్జస్ట్‌మెంట్‌కు ప్రభుత్వం సన్నాహాలు
- ఉపాధ్యాయుల అభ్యంతరం

రాయవరం: ఉపాధ్యాయుల సర్దుబాటుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. సాధారణంగా ప్రతి విద్యా సంవత్సరం ప్రారంభంలోనే ఉపాధ్యాయుల సర్దుబాట్లు చేయాలి. ప్రస్తుతం విద్యా సంవత్సరం ప్రారంభమై రెండు నెలలు గడిచింది. మరో 10 రోజుల్లో ఫార్మేటివ్ అసెస్‌మెంట్ పరీక్షలకు కూడా విద్యార్థులు సన్నద్ధమవుతున్నారు. ఈ దశలో ప్రభుత్వం ఉపాధ్యాయుల సర్దుబాటుకు ఆదేశాలు ఇచ్చింది. వీటిపై ఉపాధ్యాయుల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతోంది. సోమవారం వర్క్ అడ్జస్ట్‌మెంట్ చేస్తున్నామని, మిగులు ఉపాధ్యాయులు కౌన్సెలింగ్‌కు రావాలని మండల విద్యాశాఖాధికారులు ఏర్పాట్లు చేశారు. అయితే ఫ్యాప్టో ఆధ్వర్యంలో ఉపాధ్యాయ సంఘాలు సర్దుబాటు ప్రక్రియను వ్యతిరేకిస్తూ ఈ ప్రక్రియకు దూరంగా నిలిచారు.

ఆందోళనలో టీచర్లు

ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు ఇప్పుడు సర్దుబాటు బెంగ పట్టుకుంది. జీవో 117కు వ్యతిరేకంగా గత ప్రభుత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలల విలీనంపై ఉపాధ్యాయులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. నూతన విద్యా విధానంలో భాగంగా దీన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసింది. ఈ క్రమంలో విద్యార్థుల సంఖ్య, దూరం ఆధారంగా ప్రాథమిక పాఠశాలల్లో ఒకటి, రెండు తరగతులను సమీపంలో ఉన్న ఉన్నత పాఠశాలల్లో విలీనం చేశారు. అనంతరం ఉపాధ్యాయుల్ని సర్దుబాటు చేశారు. ఎన్నికలకు ఏడాది ముందు ఉపాధ్యాయ బదిలీలు కూడా చేపట్టారు.

అప్పట్లో వ్యతిరేకించిన టీడీపీ

విలీన ప్రక్రియను అప్పట్లో ప్రతిపక్షంగా ఉన్న ప్రస్తుత ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకించింది. అధికారంలోకి రాగానే 117 జీవోను రద్దు చేస్తామని కూడా ప్రతిపక్షంలో ఉండగా టీడీపీ ప్రకటించింది. అయితే ఇప్పుడు 117 జీవోను రద్దు చేయకుండా, ఉపాధ్యాయులను సర్దుబాటు చేయడాన్ని ఉపాధ్యాయ సంఘాలు వ్యతిరేకిస్తున్నాయి. ఈ ప్రక్రియను నిలుపుదల చేయాలని, విద్యా సంవత్సరం మధ్యలో సర్దుబాటు ప్రక్రియ చేపట్టడం వల్ల విద్యార్థుల భవిష్యత్తు నష్టపోతుందని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉపాధ్యాయ సంఘాల ప్రధాన డిమాండ్లు

- జీవో నంబరు 53 ప్రకారం ఉపాధ్యాయుల సర్దుబాటు చేయాలి.
- మండల పరిధిలోనే సర్దుబాట్లు ఉండాలి. తప్పనిసరి పరిస్థితుల్లో డివిజన్ స్థాయిలో చేపట్టాలి. జిల్లాల దాటి ఉపాధ్యాయులను సర్దుబాటు చేయరాదు.
- ప్రస్తుత అకడమిక్ విద్యా సంవత్సరంలో ఉద్యోగ విరమణ చేస్తున్నవారిని సర్దుబాటు నుంచి మినహాయించాలి.
- ప్లస్–2, సీబీఎస్‌ఈ అమలవుతున్న పాఠశాలల్లో వర్క్ అడ్జస్ట్‌మెంట్ చేయరాదు. స్టడీ లీవ్, మెటర్నటీ లీవ్‌లో ఉన్న ఉపాధ్యాయులు ఉన్న చోట వర్క్ అడ్జస్ట్‌మెంట్ నుంచి మినహాయింపు ఇవ్వాలి.
- పీఎస్ హెచ్‌ఎంను అదే పాఠశాలలో ఉన్న రోల్‌తో సంబంధం లేకుండా కొనసాగించాలి.
- 6 నుంచి 10 తరగతులు ఉన్న పాఠశాలల్లో 10 సెక్షన్లు దాటితే రెండవ హిందీ, రెండవ పీఎస్ పోస్టు మంజూరు చేయాలి.

టీఐఎస్‌లో సమాచారం

టీచర్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్‌లో ఉపాధ్యాయుల వ్యక్తిగత సమాచారాన్ని ప్రభుత్వం సేకరించింది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయుల నిష్పత్తి ఆధారంగా సర్దుబాట్లు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతుంది. ఇటీవల కాలంలో పలు కారణాలతో పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గింది. ఈ క్రమంలో చాలా పాఠశాలల్లో విద్యార్థి, ఉపాధ్యాయ నిష్పత్తిలో తేడా వచ్చింది. దీంతో ఉపాధ్యాయులు సర్దుబాటు కోసం ఫేషియల్ అటెండెన్స్ యాప్‌లో టీచర్ల వివరాలను నమోదు చేయించారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఆధారంగా మిగులు ఉపాధ్యాయులను ఇప్పటికే గుర్తించారు. మరోవైపు పలు ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్ల కొరత ఉన్నట్లుగా గుర్తించారు. సబ్జెక్టు టీచర్ల కొరతను తీర్చేందుకు మిగులు సెకండరీ గ్రేడ్ టీచర్ల(ఎస్‌జీటీ)లను వారి విద్యార్హత ఆధారంగా సబ్జెక్టు టీచర్లుగా పంపించాలని నిర్ణయించారు. మరోవైపు వచ్చే ఏడాది జనవరి నాటికి డీఎస్సీ **నియామకాలు చేపడతామ**ని ఇప్పటికే ప్రకటించారు. డీఎస్సీ 2024 నియామకాల అనంతరం తిరిగి ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాల్సి ఉంటుంది.



వర్క్ అడ్జెస్ట్‌మెంట్‌ను వ్యతిరేకిస్తూ ఫ్యాప్టో తరఫున నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

జూనియర్లకు ఎఫెక్ట్

మిగులు పోస్టుల నిర్ధారణలో కేడర్(సర్వీస్) సీనియార్టీని ప్రాతిపదికగా తీసుకుంటున్నారు. ఒక పాఠశాలలో ఉన్న ఉపాధ్యాయుల్లో మిగులు టీచర్లు ఉన్నప్పుడు వారిలో జూనియర్లను మిగులు టీచర్లుగా నిర్ధారిస్తారు. గతంలో సీనియర్ కోరుకుంటే వారిని సర్దుబాటు జాబితాలో చేర్చేవారు. ఇప్పుడు ఆ అవకాశం లేకుండా కేవలం కేడర్ జూనియర్‌ను మాత్రమే సర్దుబాటు చేయనున్నారు. ఈ ప్రక్రియ 14వ తేదీలోగా పూర్తి చేయాలని పాఠశాల విద్యాశాఖ ఆదేశాలు జారీ చేశారు. మిగులు టీచర్లను నిర్ధారించి, మిగులు టీచర్లకు సోమవారం కౌన్సెలింగ్ చేయాలని నిర్ణయించారు.

వ్యతిరేకించిన ఉపాధ్యాయ సంఘాలు

మిగులు ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియను ఉపాధ్యాయ సంఘాలు వ్యతిరేకిస్తున్నాయి. జీవో నంబరు 117, 128 ప్రకారం సర్దుబాటు ప్రక్రియను చేపడుతున్నారు. 117 జీవోనే రద్దు చేయమని డిమాండ్ చేస్తున్నప్పుడు ఆ జీవోను ఆధారంగా చేసుకుని ఉపాధ్యాయుల సర్దుబాటు ఏ విధంగా చేస్తారనేది ఉపాధ్యాయ సంఘాల ప్రధాన డిమాండ్‌గా ఉంది. ముందుగా జారీ చేసిన ఆదేశాల ప్రకారం సోమ, మంగళ వారాల్లో మిగులు టీచర్ల సర్దుబాటు చేయాల్సి ఉండగా, సోమవారం ఫ్యాప్టో, జాక్టో అసోసియేషన్ల ఆధ్వర్యంలో సర్దుబాటు ప్రక్రియను నిలుపుదల చేయాలని డిమాండ్ చేస్తూ అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ఈ నేపథ్యంలో సోమవారం జరగాల్సిన సర్దుబాటు ప్రక్రియను తాత్కాలికంగా వాయిదా వేశారు. జీవో నంబరు 117, 128 ప్రకారం కాకుండా జీవో 53 ప్రకారం చేయాలని ఉపాధ్యాయుల సర్దుబాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

మండల స్థాయిలోనే కౌన్సెలింగ్



మండల స్థాయి ప్రాతిపదికగానే వర్క్ అడ్జస్ట్‌మెంట్ చేపట్టాలి. మండల స్థాయిలో పాఠశాలల్లో వాస్తవంగా ఉన్న విద్యార్థుల సంఖ్యను ఆధారంగా చేసుకుని ఉపాధ్యాయుల సర్దుబాటు చేపట్టాలి. జీవో 53 ప్రకారం వర్క్ అడ్జస్ట్‌మెంట్ చేపట్టాలి.

– చింతాడ ప్రదీప్ కుమార్, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు, కాకినాడ

117 జీవో రద్దు చేయాలి



ఉపాధ్యాయుల సర్దుబాటుకు ముందుగా జీవో 117ను రద్దు చేయాలి. దానిని రద్దు చేస్తానంటూ ప్రస్తుత ప్రభుత్వం ప్రతిపక్షంలో ఉండగా చెప్పిన మాటకు కట్టుబడి ఉండాలి. అసంబద్ధంగా ఉన్న జీవో ప్రకారం ఉపాధ్యాయులను సర్దుబాటు చేయడం వల్ల విద్యావ్యవస్థకు నష్టం జరుగుతుంది.

– పెంకే వెంకటేశ్వరరావు, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు, అమలాపురం,

ప్రభుత్వ నిర్ణయం అసంబద్ధం



ఉపాధ్యాయుల సర్దుబాటును 117, 128 జీవోల ప్రకారం చేపట్టం అన్యాయం. ఈ నిర్ణయం పూర్తి అసంబద్ధంగా ఉంది. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రస్తుత విద్యాశాఖ మంత్రి లోకేష్ స్వయంగా జీవో 117 రద్దు చేస్తామని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చి రెండు నెలలు పూర్తయినప్పటికీ జీవో రద్దుకు ఉపాధ్యాయ సంఘాలతో చర్చించకపోవడం శోచనీయం.

– పోతంశెట్టి దొరబాబు, ఎస్‌టీయూ జిల్లా అధ్యక్షుడు, అమలాపురం

సైబర్ నేరాలతో జాగ్రత్త

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, ప్రిన్సిపల్ జిల్లా జడ్జి సునీత



సదస్సులో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ జిల్లా జడ్జి సునీత

రాజానగరం: అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని సమాజ హితంగా వాడుకోవలసి ఉండగా, కొంతమంది స్వార్థపరులు తమ స్వార్థానికి వాడుతున్న నేపథ్యంలో సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, ప్రిన్సిపల్ జిల్లా జడ్జి సునీత గంధం అన్నారు. ఈ సమయంలో యువత అప్రమత్తంగా ఉంటూ సైబర్ నేరాలను అదుపు చేయడంలో కీలకపాత్ర వహించాలని సూచించారు. స్థానిక గోదావరి గ్లోబల్ యూనివర్సిటీలో 'డ్రగ్స్ దుర్వినియోగం – యాంటీ ర్యాగింగ్' అనే అంశంపై ఇంజినీరింగ్ విద్యార్థులకు మంగళవారం చైతన్య సదస్సు నిర్వహించారు. కళాశాలలు, యూనివర్సిటీలలో సీనియర్లు, జూనియర్లను వేధింపులకు గురిచేసి ర్యాగింగ్‌కి పాల్పడం తీవ్రమైన నేరంగా పేర్కొన్నారు. ఈ సమయంలో అటువంటి వారిపై విధించే కేసులు, చట్టాల గురించి అవగాహన కలిగించారు. సీనియర్లు ఎల్లప్పుడూ జూనియర్లకు తమ విజ్ఞానాన్ని పంచుతూ మార్గదర్శకులుగా ఉండాలి గాని, శత్రువుల్లా మారకూడదన్నారు. ఈ విధంగా చేస్తే ర్యాగింగ్‌కి పాల్పడిన వ్యక్తుల జీవితాలు నాశనమవుతాయని హెచ్చరించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాశ్‌బాబు మాట్లాడుతూ మాదక ద్రవ్యాలకు ఏ ఒక్కరూ బానిసలు కావొద్దన్నారు. అదనపు ఎస్పీ ఎస్ఆర్ రాజశేఖరరాజు మాట్లాడుతూ సైబర్ నేరగాళ్లు ఏవిధంగా మోసాలకు పాల్పడుతున్నారో వివరించారు. కార్యక్రమంలో జీజీయూ రిజిస్ట్రార్ డాక్టర్ పీఎంఎంఎస్ శర్మ, ప్రిన్సిపాల్స్ డాక్టర్ టి.జయానంద్‌కుమార్, డాక్టర్ ఎస్‌వీఎస్ఎన్ మూర్తి, రాజమహేంద్రవరం ప్రభుత్వ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ తేతలి రామారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

16 నుంచి రెవెన్యూ సదస్సులు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్ కుమార్, చిత్రంలో జేసీ నిషాంతి

సాక్షి అమలాపురం: భూ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 16 నుంచి సెప్టెంబర్ 30 వరకూ జిల్లాలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ మహేష్‌కుమార్ తెలిపారు. వీటి నిర్వహణకు సంబంధించి జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిషాంతితో కలిసి మంగళవారం తహసీల్దార్లతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఆదేశాల మేరకు 45 రోజుల పాటు జిల్లాలో అన్ని గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామన్నారు. గ్రామాల వారీగా సదస్సులు నిర్వహించే తేదీలపై ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. మ్యూటేషన్, వెబ్ ల్యాండ్‌లో మార్పులు, 1బి, దారి సమస్య, భూ తగాదాలు ఎక్కువగా ఉంటాయని, ఇలాంటి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సదస్సులను నిర్వహిస్తోందన్నారు.

ఉపాధి హామీ పనులకు ప్రణాళికలు

అమలాపురం రూరల్: ఉపాధి హామీ పనులకు ఆయా శాఖల అధికారులు ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. 2025 మార్చి 31 వరకు అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ఉపాధి పథకం కింద 56 లక్షల పని దినాలకు అనుమతి మంజూరైందన్నారు. ఈ ఆర్థిక సంవత్సరానికి జిల్లాలో మెటీరియల్ కాంపోనెంట్ కింద సుమారు రూ.100 కోట్లు వచ్చే అవకాశం ఉందన్నారు. అన్ని శాఖల అధికారులు సంబంధిత శాఖలోని పనులను గుర్తించి వారం రోజుల లోపు ప్రతిపాదనలు పంపాలన్నారు.

సహకార అభివృద్ధి కమిటీ సమావేశం

జిల్లాలోని 166 ప్రైమరీ అగ్రికల్చర్ సొసైటీలలో ఆగస్టు 31వ తేదీ లోపు కంప్యూటరైజేషన్ పూర్తి చేయాలని కలెక్టర్ మహేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. ఆయన ఛాంబర్‌లో మంగళవారం జిల్లా సహకార అభివృద్ధి కమిటీ 3వ సమావేశం నిర్వహించారు. జిల్లాలోని సహకార సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని నాలుగు పీఏసీఎస్‌లు పెట్రోల్ బంకులు నడపడానికి అనుమతుల కోసం దరఖాస్తు చేసుకున్నాయన్నారు.

భారీ జాతీయ జెండాతో ర్యాలీ

అమలాపురం టౌన్: 78వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా అమలాపురం నగరశాఖ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఆధ్వర్యంలో అమలాపురం పట్టణంలో సుమారు 750 అడుగుల జాతీయ జెండాతో తిరంగా యాత్రను మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఏబీవీపీ రాజమండ్రి విభాగ్ కన్వీనర్ సత్యసాయి, విద్యానిధి కళాశాల చైర్మన్ ఏబీ.నాయుడు అమలాపురం టౌన్ ఎస్సై కిషోర్‌బాబు, ఆంజనేయులు, ఏబీవీపీ సాందీపని, రాష్ట్ర కన్వీనర్ గోపి పాల్గొన్నారు.



అమలాపురంలో భారీ జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు


నారు తీస్తున్న కూలీలు

వరి వడిగా..

పిఠాపురం: వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. జోరుగా వరినాట్లు జరుగుతున్నాయి. పొలాల్లో పనులు చేస్తున్న కూలీలలో పల్లెలు కళకళలాడుతున్నాయి. ముఖ్యంగా గొల్లప్రోలు మండలంలో ఉత్సాహంగా సాగు పనులు జరుగుతున్నాయి. ఒకే ప్రాంతంలోని మెట్ట భూముల్లో వాణిజ్య పంటలను, మాగాణి భూములతో వరిని పండిస్తున్నారు. ఈ పనుల్లో వ్యవసాయ కూలీలు బిజీగా మారారు. కాగా.. ఇటీవల కురిసిన అధిక వర్షాలతో నాట్లు దశలోనే ప్రతికూల పరిస్థితులు నెలకొన్నాయి. ఇప్పటికే వరినాట్లు 90 శాతం పూర్తవ్వగా, వాణిజ్య పంటల సాగు చివరి దశకు చేరుకుంది. వర్షాల వల్ల నీట మునిగిన పంటలు ఇప్పుడిప్పుడే తేరుకుంటున్నాయి. దెబ్బతిన్న పంటలను కాపాడుకునే పనిలో రైతులు ఉన్నారు. మరో పక్క ఇంకా నాట్లు పడని ప్రాంతాల్లో నాట్లు వేసే పనులు ఊపందుకున్నాయి.


దమ్ము చేసిన మడిని చదును చేస్తున్న రైతు


నాట్లు వేస్తున్న కూలీలు

క్లుప్తంగా

రేషన్ బియ్యం పట్టివేత


పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్న అధికారులు

పిఠాపురం: మండలంలోని బి.ప్రత్తిపాడు గ్రామంలో మంగళవారం పీడీఎస్ బియ్యం (రేషన్ బియ్యం) పట్టుకున్నట్లు రీజనల్ విజిలెన్స్ ఎస్పీ కేఎస్ఎస్వీ సుబ్బారెడ్డి తెలిపారు. పక్కా సమాచారం మేరకు గ్రామంలో తనిఖీలు నిర్వహించగా ఒక వాహనంలో 58 బస్తాల్లో ఉంచిన 3,150 కేజీల బియ్యాన్ని గుర్తించామన్నారు. దీనిని అక్రమంగా తరలిస్తున్న ఆకుల గంగరాజుపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు. సీజ్ చేసిన బియ్యం, వాహనం విలువ రూ.8,93,325 ఉంటుందన్నారు. తనిఖీలో విజిలెన్స్ ఎస్సై టి.జగనాథరెడ్డి, పిఠాపురం సీఎస్డీటీ వీరాస్వామి, కానిస్టేబుళ్లు లోవరాజు, శివ, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

16 నుంచి వెదురుపాక పీఠం వార్షికోత్సవాలు

రాయవరం: మండలంలోని వెదురుపాక విజయ దుర్గాపీఠం 52వ వార్షికోత్సవాన్ని ఈ నెల 16 నుంచి 18వ తేదీ వరకూ ఘనంగా నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు మంగళవారం పీఠంలో విలేకరుల సమావేశంలో వెల్లడించారు. వాడ్రేవు వెంకట సుబ్రహ్మణ్యం (గాడ్) 1972లో ఈ పీఠం ఏర్పాటు చేసినప్పటికీ నుంచి ఏటా వార్షికోత్సవాలు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా ఈ నెల 16వ తేదీ ఉదయం 9.18 గంటలకు జ్యోతిప్రజ్వలనతో వార్షికోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా విజయదుర్గ అమ్మవారికి ప్రత్యేక పూజలు, నవగ్రహ మండపారాధన నిర్వహిస్తారు. కొల్హాపూర్ వేదపండితులతో శ్రీమహాలక్ష్మి అమ్మవారికి తిరుమంజనం అర్చన, హోమం, సాయంత్రం 6.30 గంటలకు తమిళనాడు తిరుత్తణి ఆలయ అర్చకులతో సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి కల్యాణం జరుగుతాయి. 17వ తేదీ ఉదయం అహోబిలం వేద పండితులతో లక్ష్మీనరసింహస్వామికి తిరుమంజనం, అర్చన అనంతరం హోమం, సాయంత్రం పీఠంలోని అనంతలక్ష్మి సమేత వీర వేంకట సత్యనారాయణస్వామి కల్యాణం నిర్వహిస్తారు. 18న సీతారామ పట్టాభిషేకం, సాయంత్రం వైఖానస పండితులతో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కళ్యాణం జరుగుతుంది. విలేకరుల సమావేశంలో విజయదుర్గా సేవా సమితి ప్రతినిధులు భాస్కర నారాయణ, జి.సత్య వెంకట కామేశ్వరి, పి.సత్య కనకదుర్గ, బి.రమ, పీఠం పీఆర్వో వి.వేణుగోపాల్‌పాల్గొన్నారు.

నేటి నుంచి వాడపల్లిలో పవిత్రోత్సవాలు

- మూడు రోజుల పాటు నిర్వహణ
- ఏర్పాట్లు పూర్తి చేసిన ఆలయ అధికారులు

అత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామివారి పవిత్రోత్సవాలు బుధవారం ఉదయం నుంచి ఘనంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు దేవదాయ ధర్మదాయశాఖ డిప్యూటీ కమిషనర్, ఆలయ ఈఓ భూపతిరాజు కిషోర్‌కుమార్ తెలిపారు. పవిత్రోత్సవాల సందర్భంగా మూడు రోజులు పాటు ఆలయంలో అష్టోత్తర పూజలు, కల్యాణాలు, ఉపనయనాలు, వివాహాలను రద్దు చేశామన్నారు. పవిత్రోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయాన్ని అంగరంగ వైభవంగా తీర్చిదిద్దుతున్నారు. వివిధ రకాల పుష్పాలు, పువ్వులతో ముస్తాబు చేస్తున్నారు.


ప్రత్యేక అలంకరణలో వాడపల్లి వేంకటేశ్వర స్వామి

కార్యక్రమాల వివరాలు

పవిత్రోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం 8 గంటలకు విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, సాయంత్రం 5 గంటలకు సంకల్పం, అంకురార్పణ, అగ్ని ప్రతిష్ఠాపన, గురువారం ఉదయం 8 గంటలకు సంకల్పం, విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, సాయంత్రం 5 గంటలకు పవిత్రారోహణం, విశేష అర్చన, పవిత్ర ప్రతిష్ఠ ప్రధాన హోమాలు, 16వ తేదీ ఉదయం 8 గంటలకు సంకల్పం, మహా శాంతిహోమం, ప్రాయశ్చిత్త హోమం, మహాపూర్ణహుతి, పవిత్ర విసర్జన, మహదాశీర్వచనం నిర్వహించనున్నారు.

రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలకు వెంకటేష్

మామిడికుదురు: విశాఖపట్నంలో ఈ నెల 17వ తేదీ నుంచి జరిగే రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలకు మామిడికుదురుకు చెందిన డిగ్రీ విద్యార్థి కడలి దివ్యతేజ వెంకటేష్ ఎంపికయ్యాడు. ఈ విషయాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డీవీవీ సత్యనారాయణ మంగళవారం తెలిపారు. కాకినాడలో ఈ నెల 11వ తేదీన జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా తరపున పాల్గొన్న వెంకటేష్ బంగారు పతకం సాధించాడన్నారు. తద్వారా రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించినట్టు తెలిపారు. వెంకటేష్‌తో పాటు అతడి కోచ్ కె.చిన్నను ప్రిన్సిపాల్ సత్యనారాయణ, అధ్యాపకులు మోకా రంగారావు, యాలంగి రవికుమార్, పెచ్చెట్టి రాధ అభినందించారు.



స్వర్ణ ధ్వజస్తంభానికి మరిన్ని హంగులు


స్వర్ణ ధ్వజస్తంభం చుట్టూ ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

అన్నవరం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన వీర వేంకట సత్యనారాయణస్వామివారి దేవస్థానంలోని స్వర్ణ ధ్వజస్తంభానికి మరిన్ని హంగులు సమకూరనున్నాయి. నెల్లూరుకు చెందిన భక్తుడి విరాళం సుమారు రూ.మూడు కోట్లతో ఈ నెల తొమ్మిదో తేదీన స్వామివారి సన్నిధిలో స్వర్ణ ధ్వజస్తంభాన్ని ప్రారంభించిన విషయం తెలిసిందే. ఈ ధ్వజస్తంభం భక్తులను విశేషంగా ఆకర్షిస్తోంది. దీని ఏర్పాటు కోసం స్వామివారి ఆలయం ఎదురుగా గల శ్లాబ్‌కు గుండ్రంగా రంధ్రం చేశారు. ధ్వజస్తంభం ఆ రంధ్రంలోంచి ఆలయ శిఖరానికి సమాన ఎత్తు వరకూ వచ్చింది. దాని చివరలో సుదర్శన చక్రం, మేఖలాలు ఏర్పాటు చేశారు.

అయితే వర్షం వస్తే ఆ ధ్వజస్తంభం రంధ్రంలోంచి వర్షం చినుకులు దిగువకు పడే అవకాశం ఉంది. దీంతో దాన్ని చెక్కలతో తాత్కాలికంగా మూసివేశారు. ఇప్పుడు ధ్వజస్తంభం నుంచి పైకి చూస్తే శ్లాబ్ రంధ్రానికి వేసిన చెక్కులు తప్ప మరేమీ కనిపించవు. ఈ నేపథ్యంలో ఆ చెక్కలకు బదులు గ్లాస్‌తో తయారు చేసిన డోమ్ లాంటిది ఏర్పాటు చేయనున్నారు. దీనివల్ల దిగువ నుంచి చూస్తే గ్లాస్ డోమ్‌లోంచి ధ్వజస్తంభం చివరి వరకూ కనిపించే అవకాశం ఉంటుంది. వైదిక కార్యక్రమాలకు అవసరమైనపుడు ధ్వజస్తంభం మీద గ్లాస్ డోమ్ తొలగించేలా ఏర్పాటు చేయనున్నట్లు దేవస్థానం డీఈఈ ఉదయ్ తెలిపారు.

కవల కొబ్బరి కాయ


రెండు కన్నుల కవల కొబ్బరి చెక్కలు

కొత్తపేట: సహజంగా కొబ్బరికాయకు మూడు కన్నులు ఉంటాయి. కానీ గతంలో రెండు, నాలుగు కన్నుల కొబ్బరికాయలను చూశాం. ఇప్పుడు కొత్తగా ఒక కొబ్బరికాయలో కవల (రెండు) కాయలు బయటపడ్డాయి. కొత్తపేటకు చెందిన పురోహితుడు పెద్దింటి రామచంద్ర శ్రీహరి (రామం) ఇంట శ్రావణ మంగళవారం సందర్భంగా లక్ష్మీదేవి పూజలో కొబ్బరి కాయను కొట్టారు. దానిలో కవల కాయలు కనిపించాయి. పీచు తొలగించగా రెండు కనులు ఉన్నాయి. వీటిని పలువురు భక్తులు తిలకించారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురి మృతి

దెందులూరు: ఆగి ఉన్న లారీని వెనుక నుంచి అతి వేగంగా వచ్చిన ఓ కారు ఢీకొట్టిన ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు వ్యక్తులు దుర్మరణం చెందారు. వివరాలిలా ఉన్నాయి. తూర్పు గోదావరి జిల్లా దేవరపల్లికి చెందిన దొమ్మేటి నాగార్జున (35), యాగంటి సుబ్రహ్మణ్యం (50), దొమ్మేటి మనోజ్ (21) అన్నదమ్ముల పిల్లలు. వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నారు. ఇదిలా ఉండగా, విజయవాడలో ఆస్పత్రికి వెళ్లిన వీరు మంగళవారం తిరిగి దేవరపల్లికి కారులో బయలుదేరారు. సత్యనారాయణపురం వద్ద రోడ్డు పక్కన ఆగి ఉన్న ఓ లారీని వీరి కారు అతివేగంగా వస్తూ వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో దొమ్మేటి నాగార్జున, యాగంటి సుబ్రహ్మణ్యం ఘటనా స్థలంలోనే మృతి చెందగా, తీవ్ర గాయాలపాలై అపస్మారక స్థితిలో ఉన్న దొమ్మేటి మనోజ్‌ను హైవే పోలీసులు అంబులెన్స్‌లో ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, కారు నంబర్ ఆధారంగా మృతుల వివరాలు సేకరించి కుటుంబ సభ్యులకు ఎస్ఐ కే.స్వామి సమాచారం అందించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.


కారులో దొమ్మేటి నాగార్జున మృతదేహం


యాగంటి సుబ్రహ్మణ్యం మృతదేహం

అనుమానంతో భార్యను చంపేశాడు

- పురుషోత్తపట్నంలో దారుణం
- కేసు దర్యాప్తు చేస్తున్న పోలీసులు

సీతానగరం/రాజానగరం: తాగుడుకు బానిసైన ఓ వ్యక్తి అనుమానంతో తన భార్యను కిరాతకంగా కత్తితో నరికి హత్య చేశాడు. సీతానగరం మండలం పురుషోత్తపట్నంలో మంగళవారం ఈ దారుణం జరిగింది. వివరాల్లోకి వెళితే.. దేవీపట్నం మండలం దండంగికి చెందిన చాట్ల జాన్‌తో నేలకోటకు చెందిన దివ్య భారతి (30)కి 14 ఏళ్ల క్రితం వివాహమైంది. వారికి ముగ్గురు పిల్లలు. పెద్దమ్మాయి రమ్మిత్రీ 8వ తరగతి, కుమారులైన చెర్రి, పోసి ఆరు, ఐదు తరగతులు చదువుతున్నారు. జాన్, దివ్య భారతితో పాటు వారి తల్లిదండ్రులు కూడా సొంతూళ్లను వదిలి సీతానగరం మండలం పురుషోత్తపట్నానికి వచ్చేశారు.


దివ్యభారతి మృతదేహం

భార్యపై అనుమానం

తాగుడుకు బానిసైన జాన్ తన భార్యపై అనుమానం పెంచుకున్నాడు. తరచూ ఆమెను వేధింపులకు గురిచేసేవాడు. జాన్ తాగుడుకు బానిస కావడంతో కుటుంబ బాధ్యతను దివ్య భారతి తీసుకుంది. పురుషోత్తపట్నంలో ఒక కూల్ డ్రింక్ షాపు అద్దెకు తీసుకుని జీవనం సాగిస్తోంది. భర్త వేధింపులను భరించలేక, అతడి తీరులో మార్పురాకపోవడంతో విడిపోవాలనే నిర్ణయానికి వచ్చి వేరుగా ఉంటుంది. ఈ నేపథ్యంలోనాలుగు రోజుల క్రితం వృద్ధురాలైన తన తల్లి సునీతకు ఆరోగ్యం బాగోక రాజమహేంద్రవరం ఆస్పత్రిలో ఉన్న ఆమెకు ఆసరాగా ఉండేందుకు వెళ్లింది. అక్కడి రెండు రోజుల క్రితమే ఇంటికి తిరిగొచ్చింది.

కత్తితో నరికి..

దివ్యభారతి మంగళవారం తెల్లవారుజామున 4.45 గంటలకు బహిర్భూమికి వెళ్లిన సమయంలో జాన్ కత్తితో దాడి చేశాడు. ఆమె ఎంత బతిమలాడినా వినకుండా విచక్షణారహితంగా నరికేశాడు. చేతులు, మెడ, నడుము తెగిపోవడంతో దివ్యభారతి అక్కడికక్కడే మృతి చెందింది. అనంతరం జాన్ సిగరెట్టు కాల్చుకుంటూ అక్కడి నుంచి వెళ్లిపోయాడు. మృతురాలి తండ్రి సరిపల్లి చిట్టియ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ అడపా నాగమురళి తెలిపారు. ఘటనా స్థలాన్ని సీఐతో పాటు ఇన్‌చార్జి ఎస్సై ఆనంద్ కుమార్, సిబ్బంది పరిశీలించారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

కరప: అప్పుల బాధ తట్టుకోలేక విష గుళికలు తిని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కరప గ్రామానికి చెందిన వజ్రపు సత్యనారాయణ వెల్డింగ్ పనిచేసుకుంటూ భార్య, ఇద్దరు పిల్లలను పోషించుకుంటున్నాడు. ఆరు నెలల క్రితం వెల్డింగ్ షాపు తీసుకుని సొంతంగా వ్యాపారం ప్రారంభించాడు. పనులు అంతగా లేక, వ్యాపారం సాగక షాపు నిర్వహణకు అప్పులు చేశాడు. వాటిని తీర్చే దారిలేక తాగుడుకు అలవాటు పడ్డాడు. ఈ నేపథ్యంలో అప్పుల బాధ తట్టుకోలేక మంగళవారం ఉదయం వెల్డింగ్ షాపు వద్ద విష గుళికలు తిని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతడు వాంతులు చేసుకోవడాన్ని గమనించిన ఒక బాలుడు ఇంటికి వెళ్లి విషయం చెప్పాడు. అతడి భార్య దేవి వెంటనే షాపు వద్దకు వచ్చి భర్తను వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లింది. అక్కడి చికిత్స పొందుతూ సత్యనారాయణ మృతి చెందాడు. దేవి ఫిర్యాదు మేరకు కరప ఇన్‌చార్జి ఎస్సై పి.శోభన్ కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

హోటల్ సర్వర్ అనుమానాస్పద మృతి

అమలాపురం టౌన్: అమలాపురం గడియారం స్తంభం సెంటర్‌లోని ఒక హోటల్లో సర్వర్‌గా పనిచేస్తున్న పులిదిండి సత్యనారాయణ (50) సోమవారం రాత్రి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పట్టణ సీఐ కె.క్రిష్టోఫర్ తెలిపిన వివరాల ప్రకారం.. అల్లవరం మండలం కొమరగిరిపట్నానికి చెందిన పులిదిండి సత్యనారాయణ పదేళ్లుగా ఇదే హోటల్లో పనిచేస్తున్నాడు. సోమవారం రాత్రి వరకూ పనిచేసి నిద్రపోయాడు. హోటల్ యజమాన్యం మంగళవారం ఉదయం చూసే సరికి మృతి చెంది ఉన్నాడు. సమాచారం అందుకున్న అతడి కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకుని విలపించారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. సత్యనారాయణ హృదయ సంబంధ వ్యాధితో బాధపడుతున్నాడని సమాచారం.

కలుపు మందు రుచి చూసిన యువకుడి మృతి

పి.గన్నవరం: పొలంలో కలుపు నివారణకు ఉపయోగించే మందు ఎలా ఉంటుందోనని రుచి చూసిన యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఏఎస్సై పట్టాభి రామయ్య తెలిపిన వివరాల ప్రకారం.. పి.గన్నవరం మండలం ఊడిమూడి గ్రామానికి చెందిన అడబాల శివ (26) ఈ నెల 6న తన పొలం వద్దకు వెళ్లాడు. అక్కడ ఉన్న కలుపు నివారణ మందును ఎలా ఉంటుందో రుచి చూద్దామనుకున్నాడు. దీంతో కొద్దిగా తాగి, వెంటనే బయటకు ఊసేశాడు. కానీ ఈ విషయం ఇంట్లో చెప్పలేదు. ఈనేపథ్యంలో ఈ నెల 12న అతడు తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు వెంటనే అతడిని రాజమహేంద్రవరంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అప్పటికే పరిస్థితి విషమించడంతో కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తీసుకువెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ శివ మంగళవారం మృతి చెందాడు.

డీజిల్ ట్యాంకర్ నుంచి మంటలు


డీజిల్ ట్యాంకర్ నుంచి వెలువడుతున్న పొగ

తాళ్లరేవు: జాతీయ రహదారిపై తాళ్లరేవు వద్ద డీజిల్ ట్యాంకర్ నుంచి అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. అగ్నిమాపక శాఖ సిబ్బంది వచ్చి వాటిని అదుపు చేశారు. వివరాల్లోకి వెళితే.. విశాఖపట్నం నుంచి యానాం వెళుతున్న డీజిల్ ట్యాంకర్ తాళ్లరేవుకు వద్దకు వచ్చేసరికి టైర్ పేలిపోయింది. దీంతో ఒక్కసారిగా మంటలు రేగాయి. గమనించిన డ్రైవర్ ప్రాణభయంతో పరుగులు తీశాడు. స్థానికుల సమాచారంతో అగ్నిమాపక శాఖ సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలను పూర్తిగా అదుపు చేశారు. ఈ ఘటనతో జాతీయ రహదారిపై ట్రాఫిక్ భారీగా నిలిచిపోయింది. కోరంగి ఎస్సై పి.సత్యనారాయణ అక్కడకు చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

శిక్షణతో ఉపాధి అవకాశాలు మెరుగు

రాజానగరం: పొందిన శిక్షణను ఆచరణలో పెట్టి ఉపాధి అవకాశాలను మెరుగుపర్చుకోవాలని, వ్యవసాయాన్ని వ్యాపార సరళిలో చేపట్టి పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని రాజమహేంద్రవరం సీటీఆర్ఐ డైరెక్టర్ డాక్టర్ మాగంటి శేషుమాధవ్ అన్నారు. నర్సరీ యాజమాన్యం – ఉద్యాన పంటలలో అంట్లు కట్టే పద్ధతులపై కలవచర్లలోని కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే)లో వారం రోజుల పాటు జరిగిన శిక్షణ మంగళవారంతో ముగిసింది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి డాక్టర్ శేషుమాధవ్ అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ కేవీకే ద్వారా రైతులు, రైతు మహిళలు, యువతకు అనేక శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కేవీకే ప్రధానాధికారి డాక్టర్ వీఎస్‌జీఆర్ నాయుడు మాట్లాడుతూ రాబోయే రోజుల్లో కూడా ఉద్యాన పంటల విభాగంతో పాటు వెటర్నరీ, ఫిషరీస్, గృహ విజ్ఞానం, సస్యరక్షణ మున్నగు అంశాలపై జిల్లా ఆత్మ ప్రాజెక్టు సహకారంతో శిక్షణ కొనసాగిస్తామన్నారు. జిల్లా ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ వై.జ్యోతిర్మయి మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానాన్ని సులువుగా అవగాహన చేసుకునే విధానాలను శిక్షణలో వివరించడం హర్షణీయమన్నారు. ఉమ్మడి జిల్లాలోని గొల్లప్రోలు, బిక్కవోలు, రాజానగరం, కడియం మండలాలకు చెందిన 15 శిక్షణకు హాజరు కాగా, వారికి సీటీఆర్ఐ డైరెక్టర్ డాక్టర్ శేషుమాధవ్ ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కేవీకే ఉద్యాన పంటల అధికారి జేవీఆర్ సత్యవాణి కోర్సు కో ఆర్డినేటర్‌గా వ్యవహరించారు. కార్యక్రమంలో గ్రామీణ ఫౌండేషన్ ప్రాజెక్టు డైరెక్టర్ సత్రుపా, కామానంద్ మిశ్రా, శాంతి వర్ధన్ మినిస్ట్రీస్ డైరెక్టర్ వీరబాబు, రఘువీర్, సుచరిత పాల్గొన్నారు.


శిక్షణ పూర్తి చేసిన వారికి ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న దృశ్యం

కొనసాగుతున్న శిక్షణ


శిక్షణకు హాజరైన అధికారులు

సామర్లకోట: స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో 11 జిల్లాలకు చెందిన అధికారులకు సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై ఇస్తున్న శిక్షణ మంగళవారం కూడా కొనసాగింది. దీనిలో భాగంగా మహిళా స్నేహ పూర్వక గ్రామం అనే అంశంపై తరగతులు జరుగుతున్నాయి. ఫ్యాకల్టీలు ప్రసాద్, నిహారిక, పద్మజ మాట్లాడుతూ మహిళా సంఘాల ఆర్థిక కార్యక్రమాలల్లో మహిళల భాగస్వామ్యంపై అవగాహన పెంచాలన్నారు. బాల్య వివాహాలకు అడ్డుకట్ట వేయాలని, శారీరక ఆరోగ్యం, మానసిక స్థితిపై శ్రద్ధ చూపాలని సూచించారు. కార్యక్రమంలో ఫ్యాకల్టీలు బి.వెంకటేశ్వర్లు, చక్రఫణిరావు, బి.ఆంజనేయులు పాల్గొన్నారు.

జీజీహెచ్ ఉద్యోగికి షోకాజ్ నోటీసు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): అట్రాసిటీ కేసు పెడతానంటూ ఉన్నతాధికారులు, సహోద్యోగులను భయభ్రాంతులకు గురిచేస్తున్న ఓ ఉద్యోగికి రాజమహేంద్రవరం జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీసూర్యప్రభ మంగళవారం షోకాజ్ నోటీసు జారీ చేశారు. దారా గౌతమ్ రాంజీ అనే వ్యక్తి రాజమహేంద్రవరం జీజీహెచ్‌లో జనరల్ డ్యూటీ అటెండర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ అట్రాసిటీ కేసు పెడతానంటూ బెదిరిస్తున్నాడని కొద్దిరోజుల క్రితం అతడి వ్యవహార శైలిపై 38 మంది ఎంఎన్‌వోలు, జీడీఏలు విచారణాధికారికి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. దీంతో సూపరింటెండెంట్ జోక్యం చేసుకుని సహోద్యోగులతో వ్యవహరించే తీరును మార్చుకొని రోగుల సంరక్షణ కోసం నిబద్ధతతో పనిచేయాలని, ఇటువంటివి పునరావృతం కాకుండా చూసుకోవాలని రాంజీని మందలించారు. రాంజీ తీరులో మార్పు రాకపోగా ఫిర్యాదుదారులపై కక్షపూరితంగా వ్యవహరిస్తున్నాడు. అంతేకాకుండా అట్రాసిటీ కేసు పేరుతో బెదిరింపులకు గురిచేస్తున్నాడనే ఫిర్యాదుతో సూపరింటెండెంట్ మంగళవారం రాంజీకి షోకాజ్ నోటీసు జారీ చేశారు.

రైలు కింద పడి బాలిక ఆత్మహత్య

రాజమహేంద్రవరం సిటీ: సెల్‌ఫోన్ ఎక్కువగా చూస్తున్నావని కుటుంబ సభ్యులు మందలించడంతో బాలిక ఆత్మహత్యకు పాల్పడింది. రాజమహేంద్రవరం జీఆర్పీ ఎస్ఐ లోవరాజు తెలిపిన వివరాల ప్రకారం.. రూరల్ మండలం హుకుంపేటకు చెందిన పల్లా సిరి (15) సెల్‌ఫోన్ ఎక్కువగా చూస్తోంది. దీంతో కుటుంబ సభ్యులు మందలించారు. మనస్తాపానికి గురైన సిరి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకుంది. స్థానిక అన్నపూర్ణమ్మ గేట్ సమీపంలో మంగళవారం ఈ ఘటన జరిగింది. దీనిపై జీఆర్పీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.